క్లుప్తంగా

అడిషనల్ డీఎంహెచ్‌ఓ పరిశీలన



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రి, రిచ్ హాస్పిటల్‌లను అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం సందర్శించారు. అక్కడికి వచ్చిన పేషెంట్లకు చెందిన స్కానింగ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగనిర్ధారణ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కానింగ్ చేయించుకున్న ప్రతి గర్భిణి వివరాలను పీసీపీఎన్‌డీటీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే ఎవరికైనా టీబీ లక్షణాలు ఉంటే ప్రభుత్వ గళ్ల పరీక్ష కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ విజయకుమార్, పీపీఎం కో–ఆర్డినేటర్ హరీష్, భవ్య తులసీరామ్, ప్రవీణ, సరిత వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



నెల్లూరురూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మల్రి బాలకృష్ణ కోరారు. జర్నలిస్టుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని తిక్కన భవన్ ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులపై వైద్యం నిరాకరిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవంపై సమావేశం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈనెల 7న చేనేత దినోత్సవ నిర్వహణకు సంబంధించి స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో సోమవారం చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవారపు బాలాజీ, రాష్ట్ర, జిల్లా నేతలు తాళ్ల నరసింహస్వామి, చింతలపూడి పెంచలయ్య, గుత్తికొండ వెంకయ్య, సురేష్, జానపాటి రామసుబ్బయ్య, దోనేపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగిల్ నంబర్లాటపై వేదాయపాళెం పోలీసులు సోమవారం దాడులు చేశారు. డైకస్‌రోడ్డు సమీపంలోని ఎస్టీటీ కాలనీ మొదటి వీధిలో సింగల్ నంబర్లాడుతున్న చిన్న కొండయ్య, హనుమంతం, షేక్.మస్తాన్, కృష్ణమూర్తి, సునీల్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3,550 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వెంకటేశ్వరపురంలో చోరీ



నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వెంకటేశ్వరపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వెంకటేశ్వరపురం వాణి స్కూల్ సమీపంలో జి.శ్రీనివాసులురెడ్డి కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఈనెల 3న ఇంట్లో శుభకార్యం నిమిత్తం కలువాయి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10 వేల నగదు, వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. సోమవారం ఇంటికి చేరుకున్న బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు రక్త పరీక్షలు



నెల్లూరు (టౌన్): స్థానిక వెంగళరావునగర్‌లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు రెడ్‌క్రాస్ బృందం ఆధ్వర్యంలో సోమవారం రక్త గ్రూపు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంక్ జిల్లా కన్వీనర్ అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తం గ్రూపును తెలుసుకుని ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ నరేంద్రబాబు, మోటివేటర్ మధుసూదనరావు, టెక్నీషియన్ సంజయ్ పాల్గొన్నారు.

చెత్త వీడదు.. మురుగు పారదు..

- పట్టించుకోని ఎన్‌ఎంసీ
- దోమలతో దండయాత్ర



చక్ర అపార్ట్‌మెంట్ రోడ్డులో చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అనేక ప్రాంతాల్లో డ్రెయిన్లు, మురుగు కాలువలు చెత్తతో నిండిపోయి ఉన్నాయి. దీనివల్ల మురుగు పారక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎన్‌ఎంసీ అధికారులు ప్రత్యేకంగా అదనపు సిబ్బందిని నియమించి పనులు చేయిస్తున్నా ఆశించిన మేర ఫలితం ఉండడం లేదు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయి మురుగునీరు బయటకు ప్రవహిస్తోంది. కాలువల్లోని సిల్ట్‌ను తొలగించి మురుగునీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా పనులు చేసిన దాఖలాలు కనిపించడంలేదు.

నెలరోజులుగా..

నగరంలో 3/2 సచివాలయ పరిధిలోని మైపాడురోడ్డు ప్రశాంతినగర్, చక్ర అపార్ట్‌మెంట్ రోడ్డులో కాలువలో గత నెలరోజులుగా చెత్తా చెదారంతో నిండిపోయింది. దీంతో కాలువలోని మురుగునీరు ముందుకు కదలని పరిస్థితి. ఫలితంగా దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దీంతో ఆ వీధిలోని ప్రజలు నిద్రలేమి రాత్రులు గడుపుతున్నామని వాపోతున్నారు. అంతేకాకుండా ఎక్కడ అంటు వ్యాధులు ప్రబలుతాయోనని భయాందోళన నెలకొంది. ఇకనైనా స్థానిక సచివాలయ శానిటరీ వర్కర్లు పారిశుద్ధ్య పనుల్లో భాగంగా మురుగు కాలువలో నిల్వ చేరిన చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేసి మురుగు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు డిమాండ్



మాట్లాడుతున్న ప్రసాద్

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ పూర్తి స్థాయి విచారణ జరపాలని జిల్లా పరిషత్ కార్యాలయ డ్రైవర్ పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు ప్రభుత్వ డ్రైవర్లతో కలిసి కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ నుంచి గతంలో డ్రైవర్స్ అసోసియేషన్‌కు భవనం కేటాయించారన్నారు. తర్వాత కాలంలో అక్కడ ఏర్పడిన మొత్తం 24 షాపుల ద్వారా నెలకు రూ.2.40 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. డ్రైవర్స్ అసోసియేషన్ నాయకుడిగా ఉన్న చిరంజీవి గత 15 ఏళ్ల నుంచి లెక్కలు చూపలేదన్నారు. ఆడిట్ కూడా జరపలేదన్నారు. ప్రస్తుతం లెక్కలు చూపకుండా చిరంజీవి రిటైర్డ్ అయిన నేపథ్యంలో ఆయనపై సమగ్ర విచారణ జరపాలన్నారు. అలాగే కొంతకాలంగా ఆగిపోయిన తమ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు జరిపి కొత్త కార్యవర్గం ఎన్నుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ డ్రైవర్లు ఎస్.కృష్ణ, సురేష్, సాయి, చిట్టిబాబు, శివప్రసాద్, వేల్పుల శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీ సభ్యులకు సన్మానం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వం ఏఎన్‌ఎంల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఉమెన్‌హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి అన్నారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో ప్రమోషన్లు లేకుండా ఏఎన్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా టి.సౌందర్య, ఉపాధ్యక్షులుగా ఎ.అనిత, పి.విజయ, పి.రమణమ్మ, జి.రియాన, వి.ఉమామహేశ్వరి, కార్యదర్శిగా వి.హైమావతి, సహాయ కార్యదర్శిగా నిర్మల, జె.జయశీల, జె.పద్మ, కేవీ రమణ, విజయపద్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉమామహేశ్వరి, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా జి.వరలక్ష్మిలను ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా కంభం సుగుణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జ్యోతిర్మయి, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు.

తాగునీటికి అల్లాడుతున్న ప్రజలు

- పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ వినతి



డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సత్తార్

నెల్లూరు(బారకాసు): నగరంలోని 29వ డివిజన్ పరిధిలో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ షేక్.సత్తార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్‌ఎంసీలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన స్థానిక నాయకులతో కలిసి డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తార్ మాట్లాడుతూ గాంధీనగర్‌తో పాటు సమీప ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లామన్నారు. అయినా నేటికి పరిష్కరించలేకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీనగర్ వాటర్ ట్యాంక్ నుంచి 24 ప్రాంతాలకు నీటి సరఫరా జరగాల్సి ఉన్నా.. రోజుకు మూడు, నాలుగు ప్రాంతాలకు మాత్రమే నీటి సరఫరా చేయడంతో మిగిలిన ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. తమ ప్రాంతంలో అధిక మంది కూలి పనుల కోసం ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి వెళ్లిపోతారన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఎన్‌ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ 29వ డివిజన్ ఇన్‌చార్జి జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 48 వినతులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 48 వినతులను ప్రజలు అందజేశారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు పాల్గొని అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తం 48 అర్జీల్లో విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్–1, ఆప్కాస్ 3, ఇంజినీరింగ్ 6, టిడ్కో హౌసింగ్ 18, రెవెన్యూ 4, టౌన్ ప్లానింగ్ 8, పబ్లిక్ హెల్త్ 5, హెచ్ సెక్షన్ – 2, పెన్షన్ – 1 చొప్పున స్వీకరించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామం అరుంధతీవాడలో రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాల అభి వృద్ధికి కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో నీలగిరి సంఘం, బట్వాడిపాళెం సెంటర్, నూతన ఎస్పీ కార్యాలయం, పోలీస్ పెట్రోల్ బంక్, కేవీఆర్ పెట్రోల్ బంక్, కస్తూర్బా కళాక్షేత్రం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆశాఖ టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం తెలిపారు. అలాగే కొండాయపాళెం సబ్‌స్టేషన్ పరిధిలోని కొండాయపాళెం హరిజనవాడ, కావేరి నగర్, గొలగమూడి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



మాట్లాడుతున్న వైద్యులు



మాట్లాడుతున్న సీడీపీఓ అరుణ

నెల్లూరు(అర్బన్): పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని నారాయణ మెడికల్ కళాశాల, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని నారాయణ మెడికల్ కళాశాల, వైద్యశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్, కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక సర్వసతి నగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాలు పట్టించడం వల్ల బిడ్డకు శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. నారాయణ పీడియాట్రిక్స్, అబ్స్టెట్రిక్, గైనకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగ వైద్యులు పాల్గొని తల్లిపాల ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కార్తీక్, వైద్యులు జ్యోతి, సాంబశివారెడ్డి, ప్రసన్న, భారతి, భవ్య, శ్రావణ్, శ్రావణి లతిక పాల్గొన్నారు.

⇒ నెల్లూరు(పొగతోట): తల్లిపాల విశిష్టత గురించి మహిళలకు అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని సీడీపీఓ అరుణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రాజేంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సిగ్గుచేటు



⇒ రూరల్ నియోజకవర్గ పరిధిలోని పడారుపల్లి సబ్‌స్టేషన్ వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా 23, 24 డివిజన్ల సీపీఎం నేతలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు పెంచల నరసయ్య, సుధీర్, సురేష్, మురళి, చిన్నయ్య, సుబ్బారావు, చైతన్య, మదన్, అభిషేక్ పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎన్నికల సమయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకమని చెప్పిన టీడీపీ .. నేడు మారమార్చి అదే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అని వామపక్ష నాయకులు అన్నారు. నగరంలోని మినీబైపాస్ రోడ్డు జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి మిలీనియం సబ్‌స్టేషన్ వరకు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నేతలు మూలం రమేష్, రాంబాబు, రామరాజు, యానాదయ్య మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వెంటనే విరమించి, పెంచిన రూ.17,500 కోట్ల అదనపు చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, కాయల శ్రీనివాసులు, సిరాజ్, షానవాజ్, బసవరాజు, చిరంజీవి, ఫయాజ్, రమణారెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

20న భగవద్గీత శ్లోకాల రాత పోటీలు



మోడల్ ప్రశ్నపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఈనెల 20న త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో నగర పరిధిలోని పాఠశాల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల రాత పోటీలు ఉంటాయని ఆ వేదిక నగర కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన మోడల్ ప్రశ్నపత్రాన్ని నగరంలోని 21 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు సోమవారం అందజేశారు. ఈ పోటీలు 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. డైకస్‌రోడ్డు సెంటర్‌లోని ఓవెల్ విన్‌లైట్ స్కూల్ ఎదురుగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాల కోసం 79899 75473, 90007 56954 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సమష్టి కృషితో ప్లాస్టిక్ నియంత్రణ

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



నెల్లూరురూరల్: సమాజంలోని ప్రతిఒక్కరి సమష్టి కృషితో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నియంత్రించవచ్చని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ గురించి కలెక్టర్ ఆనంద్‌తో కలిసి జిల్లా అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే అక్టోబర్ 2వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించాలని, అందుకు అధికారులు సహకరించాలని కోరారు. దీనికోసం జిల్లాస్థాయిలో మల్టీ డిపార్ట్‌మెంట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ పోలీసు, రవాణా, సివిల్ సప్లయ్స్, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీటీసీ చందర్, డీఎస్‌ఓ విజయకుమార్ పాల్గొన్నారు.

పీ–4 లక్ష్యాలపై అవగాహన అవసరం

నెల్లూరురూరల్: పీ–4 కార్యక్రమ లక్ష్యాలపై అధికారులకు అవగాహన అవసరమని కలెక్టర్ ఆనంద్ అధికారులకు తెలిపారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో పీ–4 పురోగతిపై అధికారులతో కలెక్టర్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయిలో అన్ని విభాగాల అధికారులు పీ–4 కార్యక్రమ ముఖ్య ఉద్దేశం గురించి తెలుసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఫోస్టర్ అడాప్షన్ – కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు కార్యక్రమ పోస్టర్‌ను కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరు నెలలు పైబడి 18 ఏళ్ల లోపు వారిని రెండు సంవత్సరాల పాటు పెంచి, తత్ఫలితంగా శాశ్వతంగా దత్తత పొందే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ సుజాత, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో–ఆర్డినేటర్ సుధీర్‌కుమార్, డీసీపీఓ సురేష్ ఉన్నారు.

క్రీడా సంఘాలకూ ప్రశంసా పత్రాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు ఇచ్చి గౌరవించే విధంగా ఉత్తమ క్రీడా సంఘాలను సైతం ప్రభుత్వం గుర్తిస్తోందని మాజీ రంజీ క్రీడాకారుడు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి తెలిపారు. నెల్లూరులోని శాంతినగర్‌లో ఉన్న తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం క్రీడా సంఘాలు ఖచ్చితంగా 'శాప్' గుర్తింపు కలిగి ఉండాలన్నారు. మూడు కేటగిరీల్లో ప్రశంసా పత్రాలను అందజేస్తారన్నారు.

అనిల్‌ను కలిసిన జిల్లా నేతలు



మాజీ మంత్రి అనిల్‌తో మాట్లాడుతున్న జిల్లా నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఇస్కాన్ సిటీలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు సోమవారం కలిశారు. పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట ఇన్‌చార్జి కిలివేటి సంజీవయ్య, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత ఇతర ముఖ్య నేతలు అనిల్‌తో మాట్లాడారు.

అనిల్ కోసం కదిలొచ్చిన కేడర్





అనిల్‌కు హారతిస్తున్న మహిళలు

కూటమి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుకు సంబంధించి మాజీ మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ సోమవారం పోలీస్ విచారణకు హాజరైన నేపథ్యంలో పార్టీ నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో వారిని సైతం అడ్డగించేందుకు పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు పెట్టి నిలువరించారు. అయినప్పటికీ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి ఏది ఏమైనా తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



అనిల్ రాక కోసం వేచి ఉన్న మహిళలు



పార్టీ శ్రేణులను పంపేస్తున్న పోలీసులు



వైఎస్సార్‌సీపీ నేతలను రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు